స్థితప్రజ్ఞత

అది ఒక పెద్ద బంగళా... ఎక్స్‌పోర్ట్ గార్మెంట్సు బిజినెస్‌లో లక్షలు ఆర్జించిన వారి బంగ్లా అది. అందులో పనిచేస్తున్న పనివాళ్లని వాళ్ల చుట్టూ ఉన్న గుడిసెల వాళ్లు "బంగళా పని" వాళ్లని మహా మర్యాద యిస్తారు. పండగలు, పబ్బాలు, పుట్టిన రోజులు జరిగిననాడు ఆ యింటి నుంచి తెలిసి అమ్మగారు ఇచ్చేవి తెలియకుండా వంటవాడు మెహర్బానీకి ఇచ్చేవి – యిలా అన్ని రకాల ఆహారపదార్థాలూ అక్కడ పది పదిహేను గుడిసెలకు చేరుతూ వుంటాయి. దానికి కారణం పనివాళ్ల ఔదార్యంకన్న తామెలాంటి హోదావున్న ఇంటిలో పనిచేస్తున్నామో తమ చుట్టూ వున్న పనివాళ్లకి తెలియచెప్పాలనే తపన కావచ్చు. ఏ లెవెల్‌కు ఆ లెవెల్ 'ఎగో' వుంటుంది మరి.

ఆ రోజు రాత్రి ఎనిమిదిన్నరకి బంగళాలో పంచాయితీ జరుగుతోంది.

కారు డ్రైవరు సుబ్బారావు తలకాయ వంచుకుని నిలబడి వున్నాడు.... పరిశీలిస్తే, అతను తప్పు చేసినందుకు తల వంచుకోలేదని, తప్పనిసరి పరిస్థితుల్లో అనవసరంగా మాట్లాడడం యిష్టం లేక మౌనంగా వున్నాడని అర్థమౌతుంది మనకి.

"అయినా నీకు యిలాంటి దుర్బుద్ధి ఎలా పుట్టిందయ్యా?... చేరేటప్పుడు కాళ్లు, గడ్డాలు పట్టుకుని చేరటం, కాస్త అయినింటి వంటకాలు వంటబట్టగానే యిదిగో యిలాంటి వెధవ బుద్ధులు, ఎవత్తె అది? ఎట్లాంటి సంబంధం నీకూ దానికీ? నిన్నే నువ్వు పోషించుకోలేవు. నీకా..." ఆ యింటి అమ్మగారు స్థూలకాయం కుర్చీలో యిరికించి, కూరుకుపోయిన మెడలో చంద్రహారాలు సవరించుకుంటూ కాస్త గట్టిగానే గద్దిస్తోంది.

పెద్ద బొట్టు. ఐదు వేళ్ల వెడల్పు జరీ చీర, రెండు చేతుల నిండా బంగారు గాజులు అవిడ ఆ మాత్రం దబాయించకపోతే ఈ ఆరుగురు పనివాళ్లూ వుంటారా? అనుకుంటున్నారు కొత్తగా చేరిన తోటవాళ్లు.

సుబ్బారావు తలకాయ ఎత్తి ఒకసారి సూటిగా చూసి అలవోకగా మళ్లీ తల వంచుకున్నాడు. అతని చూపు, దాని అర్థం ఏమిటో కనుక్కోవలసిన అగత్యం అమ్మగారికి లేదేమో కానీ, సుబ్బారావు నైతిక పతనావస్థ గురించి మెహర్బానీ కోసం అమ్మగారికి చెప్పిన, అయ్యగారి అసిస్టెంట్ నరసింహం మాత్రం కొంచెం ఉలిక్కిపడ్డాడు.

"అదెవర్తో దిక్కులేంది... పోనీండమ్మా, తెలియక చేశాడు...." సర్దేద్దామని ప్రయత్నించాడు.

"నరసింహం!" కొంచెం తీక్షణంగానే అన్నాడు సుబ్బారావు. ఆగిపోయాడతను ఆ గొంతు విని. కాని అమ్మగారు వదిలిపెట్టలేదు ఆ విషయాన్ని. మరింత పెద్ద గొంతుతో ఝంఝూమారుతంలా ఝాడించి వదిలిపెట్టింది. ఒక అరగంట యింట్లో గాలి దుమారం లేచింది. నీతి, అవినీతి, వెధవ బుద్ధులు, ముఖం చూస్తేనే పాపం చుట్టుకోవడాలు – ఇలా చాలా మాటలు దొర్లాయి.

ఏం మాట్లాడలేదు సుబ్బారావు.

"అసలు నీకు దేవుడంటే భయం, పాపభీతి ఛస్తేగా!" క్లైమాక్స్‌కు వెళ్లిపోతున్నాయి ఆవిడ మాటలు

అంతకు ముందురోజు అభిషేకం చేయిద్దామని దేవాలయానికి వెళితే, అయ్యగారు వున్నారన్న భయమన్నా లేకుండా, లోపలకి రాను అన్న సుబ్బారావు, యింట్లో ఆర్భాటంగా తను వ్రతాలు, నోములు నోస్తే నిర్లక్ష్యంగా అతను చూసే చూపు... యివన్నీ చాలా రోజులుగా అమ్మగారి కడుపులో కాలుస్తున్నాయి. "ఏదన్నా భరిస్తాను కానీ, దైవచింతన లేకపోతేమాత్రం...." అని చేతులు ఝాడించుకుంటూ ఆమె చెప్పే మాటలు చాలామంది నోరు తెరుచుకుని వింటూ వుంటారు.

"అయ్యగార్ని చూడు – ఆ భక్తి, ఆ పూజ, అందుకే ఆయన అంత ఐశ్వర్యంతో, అంత సలక్షణంగా వున్నారు. మీరు దరిద్రంలో ఇట్లా..." విపరీతమైన నీతిభక్తి అక్షరం అక్షరంలోనూ మందుతూందేమో!

"ఆయనెందుకు మధ్య.... " అంత వేడిగానూ అక్షరాలను ఒత్తి పలుకుతూ జేబులో తాళాలు తీసి టేబిలుమీద పెడుతూ అన్నాడు సుబ్బారావు.

"ఎవర్ని, అయ్యగార్నే!..." అతని చర్యకు కాస్త ఉలిక్కిపడుతూ అన్నదా యిల్లాలు.

"కాదు, భగవంతుణ్ణి! నేవస్తానమ్మగారూ... వేరే డ్రైవరును చూసుకోండి...."

గుండె గతుక్కుమంది అమ్మగారికి. అసలే ఆవిడ దగ్గర ఏ డ్రైవరూ రెండు నెలలకన్నా ఎక్కువ పనిచేయలేరని ప్రతీతి. కారణం ఆవిడ దగ్గర చెయ్యి చాచి జీతం తీసుకునేవాళ్లందరూ 'దేహి' అంటున్నారనుకుంటుంది. కానీ, వాళ్ల పని, తనిచ్చే జీతం సమానమని ఆమె ఎప్పుడూ ఆలోచించలేదు.

"మేమే నయం... పనిచేస్తున్నాం, డబ్బులు తీసుకుంటున్నాం. నీ సంగతేమిటి? నువ్వు తాళి బొట్టు కట్టించుకుని లక్షలు అనుభవిస్తున్నావు.... నువ్వేం చేస్తున్నావ్?" అని, ఎడాపెడా అడిగిపోయింది రేచులాంటి పనిపిల్ల. మరి దాన్ని ఆమె అనకూడని మాటలన్నీ అంది.

గతిలేనితనం దొంగతనానికి, దిక్కులేనితనం రంకుతనానికి అంటగట్టడం ఆవిడ కేటగిరీ మనుష్యులకు అలవాటు మరి!

కానీ, ఆవిడ యిప్పుడు సుబ్బారావు పద్ధతి చూసి ఉలిక్కిపడటానికి కారణముంది. అతను వచ్చి ఆరు నెలలైంది. ఒక్క కంప్లైంట్ లేదు. ఎదురుచెప్పడు.

మనిషి చదువుకున్నవాడేనని వింది. కాని ఆ మాట బైటకు ఎప్పుడూ అనదు. ఆవిడ హజానికి అతను ఏనాడూ అడ్డు రాలేదు. తమాషా, ఏమిటంటే, భర్త కూడా అతన్ని గౌరవించడం చూసి ఆమె భయపడేది కూడా.

అటువంటివాడిని, ఏదో సరసింహం వచ్చి ఎవర్తెనో అనాధను తన గుడిసెలో పెట్టుకున్నాడన్నమాట వినగానే, అనవసరంగా తొందరపడ్డానేమోననిపించింది ఒక్క క్షణం ఆవిడకు.

అడుగులో అడుగు వేసుకుంటూ గేటు తలుపు తెరచి వెళ్లిపోతున్న సుబ్బారావుని చూస్తూ నిలబడిపోయింది అమ్మగారు.

❀ ❀ ❀

"ఇప్పుడు చూడు... నా వల్ల నీ ఉద్యోగం పోయింది...."

తలుపుకు అలవోకగా ఆనుకుని నిలబడ్డ రమణమ్మను చూశాడతను.

నవ్వొచ్చింది సుబ్బారావుకు.

"ఎవరు చెప్పారు పోయిందని?...."

"మరి?"

"ఇంకాసేపట్లో కబురొస్తుంది... వెళతాను...."

"అంత ధైర్యం ఏమిటి నీకు?" ఇంతింత కళ్లల్లో, ఆ మాటల్లో అతనిపట్ల ఆమెకు ఉన్న ఆరాధన, గౌరవం. అది ఖరీదుకు ఆడదాన్ని కొనుక్కునే ఏ మగవాడికీ ఎప్పటికీ అర్థంకానిది.

"ధైర్యం ఏముంది? వాళ్ల అవసరం... నా సొంత ఆలోచనలు, వ్యవహారాల్లోనూ కల్పించుకోనంటే నాకూ అభ్యంతరం లేదు... అంతే... నాలాంటి డ్రైవరు వాళ్లకు కావాలి. ఇప్పటిదాకా మర్యాదగా చూశారు కాబట్టి నాకూ అభ్యంతరం లేదు... కారణం ఇలాంటి సమస్యలు వ్యక్తుల వల్ల కాదు, వ్యవస్థ వల్ల వచ్చినవి కాబట్టి ఎక్కడా తప్పవు. కాదూ కూడదంటే నాకు వేరే ఉద్యోగం దొరక్కపోదు. చూద్దాం!" ఆలోచిస్తూ అన్నాడతను.

మాట్లాడకుండా గుడిసె లోపలికి వెళ్ళిపోయింది రమణమ్మ. అటే చూశాడతను. రోడ్డు లైటు నీడ మెరుస్తున్న ఆమె నడుం మీద ప్రతిఫలించింది వెలుగు చారలా... ఆమెలో లావణ్యం కన్న ఆ మనిషిలో లాలిత్యం మెరిసినట్లనిపించింది అతనికి.

ఆరు బయట మంచం మీద తలకింద రెండు చేతులూ పెట్టుకుని పడుకున్న అతని చూపులు చుక్కల్ని చూస్తూ గతాన్ని చీలుస్తున్నాయి.

❀ ❀ ❀

ఆరు నెలల క్రితం... అయ్యగారి ఫ్యాక్టరీలో రోజు కూలీకి వచ్చింది రమణమ్మ. ఆమె స్వతహాగా కూలీ మనిషికాదు. ఆ మాటకొస్తే అదొక కులం, జాతి,

వర్గం కాదు. రాజకీయాలు, అవగాహన లేని ఆర్థిక వ్యవస్థ యిలా కుటుంబాలను తల్లకిందులు చేసి కూలీ వాళ్ళుగా మార్చేస్తుంది. ఒక్క మనిషి సంపాదిస్తుంటే, ఆరుగురు కూర్చుని తినే అవకతవక పరిస్థితి తెచ్చే సాంఘిక, నైతికమైన మార్పులు సామాన్యమైనవి కావు. కానీ ఆ విషయం మరొక తరం ఆర్థిక శాస్త్రవేత్తలు చెప్పేదాకా ఈ తరం వుండదు మరి.

ఎలిమెంటరీ స్కూలు మాష్టారు మూడో కూతురు రమణమ్మ. కష్టపడి, అప్పులు చేసి పెళ్లి చేశాడు పై ఇద్దరమ్మాయిలకు. ఒక పిల్ల అత్తింటి బాధ పడలేక పారిపోతే, మరొక అమ్మాయి కట్నం చెరకు బలైపోయింది. తెచ్చిన అప్పు తీర్చనేలేదు, చేసిన పెళ్లిళ్ల అవలక్షణాలకి గుండాగి చచ్చిపోయాడాయన.

మూడవ కూతురు రమణమ్మ. సెవెన్తు క్లాసు దాకా చదివిన రమణమ్మ, 18 ఏళ్ల యవ్వనం ఒద్దన్నా సుకుమారాలు శరీరానికి సంతరించుకున్న రమణమ్మ... సంపాదిస్తే కానీ... తప్పని పరిస్థితిలో అయ్యగారి ఫ్యాక్టరీలో రోజు కూలీకి అడుగు పెట్టింది.

చాలా మందిలాగానే, ఒక రోజు చీకటి రాత్రి, రాయల్ సెల్యూట్ బాటిల్‌కి సెల్యూట్ చేసిన అయ్యగారికి ఆహుతి అయిపోయింది. ఆర్థిక సమస్య, పరిస్థితుల ఒత్తిడి, చాలామందిని అలా కాటేసి, చీకటి తెరల వెనకాల చిక్కడేట్లు చేస్తాయి. తప్పదు. కానీ అమాయకురాలు రమణమ్మ తన మీద అయ్యగారికి ప్రేమనుకుంది. అందలమెక్కిస్తారనుకుంది. కాదని తెలియగానే ఎదురు తిరిగింది. 'ఇది న్యాయమా?' అన్నది. 'నీ కూతురికి, నీ చెల్లెలికి ఇలా జరిగితే....' అని కథల్లో మాటలు మాట్లాడింది.

అది అయ్యగారి హజానికి, ఆయన కింది వందిమాగధులకు ఎదురు దెబ్బ. చావగొట్టి అసుర సంధ్యవేళ రోడ్డు మీదకు తోసేశారు.

అయ్యగార్ని తీసుకు వెళదామని వచ్చిన డ్రైవరు సుబ్బారావు క్రోటన్స్ పక్కన తెగిన పూలదండలా పడివున్న రమణమ్మ కళ్లబడింది. 'ఏమిటి?' అని వెంటనే అడగలేదు... ఎందుకో మెల్లిగా తెలుసుకున్నాడు... తనింట్లో ఆశ్రయం యిచ్చాడు.... ఇది అన్యాయం అంటూ ఎవరి మీదా ధ్వజమెత్తలేదు. ఆశ్చర్యపోయింది. రమణమ్మ.

"అయ్యగారు చేసిన అన్యాయం ఏమిటి అన్నది కాదు ఇప్పటి ప్రశ్న. కారణం డబ్బు, హజం, అట్లా చాలా పాపాలు చేయిస్తాయి ఆయనలాంటి వాడిచేత. నీకు నేను చెయ్యగలిగిన న్యాయం ఏమిటి? అన్నదే నా సమస్య..." అన్నాడు.

"నేను వెళ్లిపోతాను మా యింటికి." ఏడుస్తూ అభిమానంగా అన్నది రమణమ్మ. అతను ఓదార్చాలన్న కోరిక వుంది ఆమెలో.

"ఎందుకు? ఎలాగూ చెడ్డావు కదా.... అని నిన్నూ వృత్తిలోకి దింపడానికా?" సూటిగా ఏమాత్రం వుద్రేకం లేకుండా అన్నాడు.

బెబ్బులిలా పడింది మీద... "ఏమనుకుంటున్నావు మా కుటుంబం గురించి?" అతని మొఖం నిండా గాట్లు,

మంట పుట్టిన చెంప మీద చెయ్యిపెట్టి రాసుకున్నాడు. తడైంది.... రక్తం.... సన్నగా నవ్వాడు అతను.

నాలుక కొరుక్కుంది రమణమ్మ. ఈ వారం, పదిరోజుల్లో తన కుటుంబం గురించి ఎంక్వయిరీ చేశాడతను అని ఆమెకు తెలుసు. రాత్రి తొమ్మిది గంటల వేళ ప్రతిరోజూ రిక్షాలో వెళ్ళే తన చెల్లికి ప్లాస్టిక్ పువ్వు అని పేరు పెట్టాడనీ గుర్తుకు వచ్చిందామెకు.

తన తొందరపాటుకు క్షమించమన్నట్లు చూసింది. లోపలకి వెళ్ళి గొబ్బరి నూనె తెచ్చి రాసింది. మాట్లాడలేదతను.

"మరి నన్ను ఇంట్లో పెట్టుకుంటే నిన్ను...." ఆమె గొంతులో మార్దవత్వానికి మరొకడైతే కరిగిపోయుంటాడు. కానీ అతను సుబ్బారావు. జీవితాన్ని చాలా ఏంగిల్స్‌లో చదివినవాడు.

"నువ్వు యిక్కడ ఖాళీగా వుండవు, వుండబోవు. వుంచి నిన్ను పోషించడానికి నేను నవాబునూ కాను. ఒకవేళ అయినా, అది నా పాలసీ కాదు...."

"అలా నీ మీద ఆధారపడటం నాకూ అసహ్యమే." మరొకసారి ఎదురు తిరిగింది ఆడపులిలా.... ఆ పంజా విప్పిన పౌరుషం ఎంతసేపు ఆగుతుందో అతనికీ తెలుసు.

మళ్ళీ నవ్వాడతను.

"అదీ మంచి మాట.... నీకే కాదు ఎవరికైనా అది అసహ్యమనిపించాలి."

"అవకాశముంటే అందరూ అలాగే ఉంటారు...." ఆలోచిస్తూ అన్నది రమణమ్మ.

"ఉండరు. నిన్నే తీసుకోరాదూ ఉదాహరణకు. ఈ క్షణంలో నువ్వు ముట్టుకోగానే నేను కరిగి ప్రవహిస్తే నా చేత తాళి కట్టించుకుని, నా మీద ఆధారపడిపోవడానికి మానసికంగా సెటిల్ అయిపోయావు నువ్వు.. అది ఆధారపడటం అనుకోవు నువ్వు. కారణం అది పెళ్ళి... అవునా?"

"ఛీ!" దూరంగా జరిగింది రమణమ్మ. కానీ, ఆమెకు తెలియకుండానే ఈ వ్యక్తి పట్ల స్పందన కలుగుతోంది. తలెత్తి అతణ్ణి చూసింది.

"నా తల్లి చక్కదనానికి కలెక్టరొస్తాడే...." అని చెప్పుకునేవాడు తన పిచ్చి తండ్రి. అవి గాలి మాటలని తెలిసినా దాని అర్థం ఆమె హోదాలో వుండాలనే.... కానీ ఇతడు? ఆర్థిక పరిధుల్లో అనామకుడు, సామాన్యుడు. కానీ మనిషి ఉన్నతుడు.

"నాన్నా! చచ్చి ఏ లోకాన వున్నావో నాకు తెలియదు. నిజంగా నీకు నా మీద ప్రేముంటే నాకు కలెక్టరు రావాలనీ, అయ్యగారులాంటివాడు కావాలనీ కోరుకోకు. హృదయము, ఆలోచన, తనలాంటి నలుగుర్ని ఉద్ధరించగల వ్యక్తి కావాలని కోరుకో.... నువ్వే కాదు – ప్రతి తండ్రి అదే కోరుకోవాలి నాన్నా!" కళ్ళు మూసుకొని తనలో తాను ప్రార్థిస్తోంది రమణమ్మ. కానీ, కానీ... దేవుడులాంటి ఇతనికి తను....

"నేను చెడిపోయినదాన్ని...." కన్నీరు తుడుచుకుంటూ గభాల్న అన్నది.....

ఆమె ఆలోచనలు చదివినట్లు నవ్వాడతను. "ఆ మాటకు నా దృష్టిలో అర్థం లేదు. నేను చాలా జీవితం చూసినవాడిని, శీలం మనిషి ప్రవర్తన వల్ల వస్తుంది. దాన్ని శరీరానికి, గుప్పెడు బూడిదైపోయేదానికి అంటగట్టడం నా పద్ధతికాదు నేను పనిచేసే యింట్లో పెద్దమ్మాయి నా వంక చూసే చూపుల్తోనే ఆ పిల్ల శీలం ఏనాడో పోయిందని నా ఉద్దేశం. ఇవన్నీ నీ నీతుల పరిధికి అందవు... అర్థమైందా?"

మాట్లాడలేదు రమణమ్మ.... ఇంతంత కళ్లతో చూస్తోంది.

ఏమిటీ మనిషి? ఎన్నోసార్లు యితన్ని ఫ్యాక్టరీలో అంతకుముందు చూసింది. కానీ సూటు, బూటు, కారు, కళ్లజోడు వున్న అయ్యగారి ముందు తనకెవరూ కనిపించే వారు కాదు. తెలియకుండానే తన కళ్లల్లో అయ్యగారికి ఆహ్వానం వుండే, తనకీ గతి పట్టిందా? ఉలిక్కిపడింది రమణమ్మ.

ఇలా తను ఏనాడూ మామూలు పరిస్థితిలో ఆలోచించేది కాదు. ఈ మనిషి సన్నిధిలో తన తప్పు తనకు అర్థమౌతోంది. ఎవరితను?

"రేపు ఇన్‌స్టాల్‌మెంటు మీద నీకు మిషను కొనిపెడతాను. చుట్టు పక్కలవాళ్లకి కుట్టి పెట్టు. ఇద్దరికి పాఠం చెప్పు, ఇది నీకు సమ్మతమైతేనూ, సంతోషమైతేనే చెయ్యి. లేదా డబ్బు, అదిచ్చే సుఖం ముఖ్యమనిపిస్తే మాట్లాడకుండా నీ చెల్లెలు జీవితంలోకి వెళ్ళిపో నీతి, దేముడు, సంఘం – వీటికి నీ ఆకలి, నీ మనసు అక్కరలేదు. ఒక వేళ ఇవ్వాళ నా మెహర్బానీ కోసం నువ్వు నీ మనసు చంపుకున్నా, రేపైనా మనస్సు నీకు ఎదురు తిరక్కూడదు. బాగా ఆలోచించుకో. వెళ్లి పడుకో...."

మంచం మీద వెల్లికిలా పడుకుని వెన్నెలకు అడ్డమా అన్నట్లు కళ్ల మీద చేయి పెట్టుకుని పడుకున్నాడతను.

చుట్టూ గుడిసెల్లో తాగుబోతుల కోలాహలం. వెన్నెల ఏ యింట్లోకి ప్రవేశించడం లేదు. ఆడవాళ్ల కేకలు, పిల్లల ఏడుపులు, కుక్కల రొద....

గుమ్మం పట్టుకుని చాలాసేపు ఆలోచిస్తూ నిలబడింది రమణమ్మ. నిశ్శబ్దంగా కంచంలో అన్నం, పులుసు వడ్డించి, అతని ముందు పెట్టి, లోపలికి వెళ్లిపోయింది.

❀ ❀ ❀

"ఆ అడది ఎవరైతే నీకెందుకు? అతని పర్సనల్ విషయాలు మనకెందుకసలు? తీరి కూర్చుని అందరితో తగాదా నీకు. చాలా మంచివాడతను...." అయ్యగారు అమ్మగారు తగాదా వేసుకున్నారు – సుబ్బారావు యింటిలో వున్న "అడది" ఎవరో ఆయనకు తెలియకపోయినా.

"అలగా జనం, అలగా బుద్ధులు...." విసుక్కుంటూ వెళ్లిపోయింది లోపలికి అమ్మగారు – అలగా జనం, అలగా బుద్ధులు ఎవరివో తెలియకపోయినా.

అంతే! మర్నాడు బంగళా నుంచి సుబ్బారావుకు కబురొచ్చింది. మాట్లాడకుండా వెళ్లి పనిలో చేరాడతను.

❀ ❀ ❀

కానీ అమ్మగారు ఆ విషయాన్ని అంత తేలిగ్గా మర్చిపోయే వ్యక్తి కాదు. కూపీలు లాగింది కాలక్షేపానికి. అసలు విషయం తెలిసేటప్పటికి ఆ పిల్ల మీద కక్ష ఏర్పడిపోయింది. 'ఆమె అందగత్తేనా' అని వాకబు చేసింది. తన భర్త దోషం కన్న దానికి సుబ్బారావు ఆశ్రయం యివ్వడం భరించలేకపోయింది ఆమె ఇల్లాలితనం.

"చూడు.... మా వైపు నుంచి ఒక మంచి పిల్లను తీసుకు వస్తాను. పెళ్లి చేసుకో. పనిమంతురాలు, గుణవంతురాలు. అది మా యింట్లో పనిచేస్తుంది. నువ్వు డ్రైవరుగా ఉండు. ఇద్దరూ అవుట్ హౌసులో వుందురుగాని, వెడిపోయిందట – అది నీకెందుకు? ఆ! ప్రసాదం ఇందా, చెయ్యి పట్టు,...." కాళ్లనిండా పసుపు రాసుకుని పట్టుచీరతో నిలబడ్డ ఆమెవంక సన్నగా నవ్వుతూ ఒక చూపు చూశాడు సుబ్బారావు.

అతని చూపుకు అప్పుడు ఆవిడకే అర్థం తెలిస్తే, "అయ్యగారు మీకు పనికిరాగాలేంది, రమణమ్మ నాకెందుకు పనికిరాదు అమ్మగారూ?" అన్న ప్రశ్నకు ఆవిడే కాదు, అందరు యిల్లాళ్లూ గజగజవణికి పోయుండేవారు. ఆ ప్రశ్న ఊహించకుండానే బ్రతికేస్తున్నారు కాబట్టే ఇంకా "పెళ్లి" అనే శిధిలాలయం కూలిపోకుండా మిగిలివుంది.

ఫ్యాక్టరీలో ఏవో ఉత్సవాలు చేశారు.... పెద్దవాళ్లంతా పార్టీలు చేసుకుంటే, వర్కర్లు అందరికీ అమ్మగారు పురాణ కాలక్షేపం పెట్టించారు. ఆ తినే డబ్బులు నాలుగూ మావూరివాడే తిననీ అని పుట్టింటినుంచి పిలిపించినాయన భగవద్గీత చెబుతున్నాడు, ఎవరికీ ఏ మాత్రం అర్థం కాకుండా....

"స్థితప్రజ్ఞుడు అంటే ఏమిటి?" సుబ్బారావు చెయ్యి పట్టుకుని కళ్లల్లోకి చూస్తూ అడిగింది రమణమ్మ.

డ్రైవరు పక్కన, పూచిన తంగేడులా ఎర్ర చీరతో, పెద్ద కుంకుమ బొట్టుతో, మెళ్లో పసుపుతాడుతో నిలబడ్డ ఆ అమ్మాయిని చూసి ఉలిక్కిపడ్డాడు అయ్యగారు.

"ఎవర్రా అది?...." నరసింహాన్ని అడిగాడు.

ఈ ప్రశ్న ఎప్పుడో ఒకప్పుడు వస్తుందని తెలుసు నరసింహానికి. కానీ, చిత్రం అయ్యగారికి మందునూ, మానినినీ సప్లైచేసే నరసింహంలో కూడా నరుడు నిద్ర లేచాడు. ఈ మధ్య సుబ్బారావుతో పరిచయం ఎక్కువైన తర్వాత తాము ప్రపంచానికి చేసే చెడుపును గురించి అతడు ప్రశ్నించలేదు. 'ఎందుకు ఇలా చేస్తున్నారు? మీ తలకాయలు నరకాలి...' అని ఎదురు తిరిగి అహంకార దర్పానికి ఆహుతి అయిపోలేదు. మౌనంగా, తాము పాడు చేస్తున్న ప్రపంచాన్ని తన పద్ధతిలో బాగు చెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు. ఇదేం పని అని అడగలేదు. 'ఇది నా పద్ధతి' అని చెప్పాడు.

"పెళ్లి చెయ్యాలంటే బోలెడు డబ్బు కావాలి.... లేకపోతే పిల్ల పక్కదార్లు పడుతోందని భయం" అని ఒక రోజు కష్టం, సుఖం చెప్పుకున్నాడు సుబ్బారావుతో నరసింహం.

"పెళ్ళి చెయ్యదలచుకుంటే, యిచ్చే దబ్బుతో వాచీ, ఉంగరం, చెంబు యివన్నీ పెట్టకు – ఏ తాగుడో, పేకాటకో తాకట్టు పెడతాడు నువ్వు అనుకునే పెళ్ళి కొడుకు. కాదు కూడదంటే అసలు అలాంటివాడికి పిల్లనివ్వకు. ఆ దబ్బుతో ఏ కిళ్లీ కొట్టో పెట్టించు.... యిద్దరూ కష్టపడి నాలుగు డబ్బులు కళ్ల చూస్తారు. పెళ్లి పేరుతో యిద్దరికీ ఖర్చు పెట్టుకోవడం నేర్పించడంకన్న సంపాదించుకోవడం నేర్పిస్తే, మంచిది...." అని సలహా యిచ్చాడు సుబ్బారావు.

కానీ, నరసింహం అందరి తండ్రుల్లాగానే వినలేదు. ఫలితం అనుభవించాడు. అందుకే ఈమధ్య అతడిలో జంతువు నిద్రపోయి, నరుడు నిద్ర లేస్తున్నాడు.

"పోన్లెండి బాబూ! వెధవ గోల... విషయం బయటకొస్తే బోలెడు గోల...." అన్నాడు సర్దేస్తున్నట్లు.

లౌక్యుడు అయ్యగారు... అందుకనే అర్థం చేసుకొని ఊరుకున్నాడు.

పెద్ద వెంకటగిరి చీరతో, రవ్వల నగలతో, ఆడంబరంతో, ఒక పెద్ద వివిధాలంకారాల బంగారు ధ్వజంలా వచ్చింది అమ్మగారు. ఆవిడ ఆశ్రయం కావాలనుకున్న వాళ్లందరి నమస్కారాల మధ్య తననే పరిశీలనగా చూస్తున్న డ్రైవరు పక్కన "అది" కళ్లబడింది ఆవిడకు. ఒళ్లు దహించుకుపోయింది. చుర చుర చూసింది. క్రూరత్వం ఆవిడ మొఖానికి వికారాన్నిచ్చింది. కానీ, ఆవిడ చూపు ఆశ్చర్యంగా మారింది. కాసేపటికి భయంకరంగా చూస్తున్న చూపు, భయంగా రెప్పలు వాల్చుకుంది.

ఆ మార్పు గమనించినవాళ్లు చాలా తక్కువమంది. సూక్ష్మగ్రాహ్యత వున్న సుబ్బారావు దృష్టి ఆ చూపును తప్పించుకోలేదు.

అదే అడిగాడు యింటికి వచ్చిన తరువాత రమణమ్మను – "ఎందుకలా అయిపోయింది ఆవిడ? కోపంగా చూసావా?"

"నేనా" చల్లగా నవ్వింది రమణమ్మ. సుబ్బారావు సాహచర్యంలో చాలా మారింది ఆ పిల్ల? ఖరీదు, విలువ. ఈ తేడా తెలిసిన మనిషి నవ్వే నవ్వు అది.

"జాలిగా చూశాను ఆవిడ వంక. ఓసీ పిచ్చి తల్లీ! నీకన్న నేనెంత అదృష్టవంతురాల్ని... ఇంత కట్నంపోసి, అంత ఆర్భాటంగా పెళ్లి చేసే నీ అయ్య నీకు, కనీసం మానవత్వం వున్న వాడినన్నా మొగుడుగా తేలేకపోయాడు. అందుకే రాతి బొమ్మలో దేముణ్ణి వెతుక్కుంటున్నావు. మరి నాకో.... దేముడే దొరికాడు. చూశావా? నిన్ను చూస్తే జాలేస్తోంది.... అనుకున్నాను మనసులో. ఆ మాటలే నా చూపుల్లో కనిపించేయి కాబోలు, తలొంచుకుంది ఆవిడ...." నవ్వుతూ లేచి అతని దగ్గరకు వస్తూ–

"నీ కొకటి తెలుసా?.... నాకు "స్థితప్రజ్ఞుడు" అంటే అర్థం తెలిసింది" అన్నది.

ప్రకృతి నిశ్శబ్దంగా నవ్వింది.

వెన్నెట్లో మల్లెపూల దుప్పటి దులిపింది.

(వనిత – ఆగష్టు, 1987)